# అంధలోకం

★

పవిత్రప్రణయమే వివాహధర్మంలోని పవిత్ర సూత్రం. అట్టి ప్రణయాన్ని అందచందాలుగాని, అంగసౌష్టవాలుగాని, అలంకారాలుగాని- ఆకర్షించలేవు.

పవిత్రప్రేమ పవిత్రహృదయంలోనే ప్రతిఫలిస్తుంది. ఇదే—

పట్టభద్రుడు ప్రభాకరుడి జీవితాశయానికి ఇతివృత్తం అయింది.

అనాథ శకుంతలకు అర్థంకాకపోయినా, ఆమెలో అనురాగవాహిని పొంగిపొర్లింది.

★

"శకుంతలా! నీవింత దీనంగావున్నావేమి? ఈ కన్నీటి కెరటాలేమిటి?...నీవైఖరిచూస్తే రాత్రంతా నిద్రలేకవిలపిస్తున్నట్టుంది......మాట్లాడవూ? నీ మనస్సు బాధించేవిషయం అంతరంగిక మిత్రుడనైన నాతో చెప్పకూడదూ?" అంటూ ఆప్యాయంగా ఆమె తలనిమురుతూ, బుజ్జగిస్తూ సమీపంగాకూర్చున్నాడు ప్రభాకరరావు.

'నా' అన్నవారులేని విశాలప్రపంచంలో ఏకాకిగా జీవిస్తోంది శకుంతల.

ప్రభాకరరావు ఆడినమాటలవలన, బాధింపబడ్డ ఆమె మనస్సు కొంతవరకు ఉపశమించి ఊరటబడింది. క్షణంక్రిందట లోకం తనకు సర్వశూన్య మనుకొన్న శకుంతల తనకుకావలసిన సర్వస్వము ఉందనుకొని నిర్ధారణ చేసుకుంది. అందువల్లకలిగిన అపరిమితానందంతో మాటాడలేకపోయింది. "శకుంతలా! మాట్లాడవేమి? ఎల్లప్పుడూ నీ దృష్టిలోపానికి ఏడుస్తూకూర్చుంటే ఫలమేమైనావుందా? భగవంతుడేమిచేసినా మనమేలు కొరకేఅన్నారు అనుభవజ్ఞులు." అంటూ తనవుపన్యాసాన్ని మరికొంతవరకు సాగదీశాడు.

"ప్రభాకర్! నేనేమి పాపంచేసేనని భగవంతుడు నాకీశిక్ష విధించాడు? పదునైదుసంవత్సరాలవరకు ప్రకృతి రామణీయకంచూచి ఆనందించినకళ్లు ఇట్టేమాయమై గుడ్డిదాన్నయేనంటే కారణం ఏమని నిరూపించుకోవాలి? నాకడగండ్లుచూడలేక కాబోలు కనికాచిన తలిదండ్రులు చినప్పుడే కాలంచేశారు. పెంచిపెద్దచేసిన నాయనమ్మ పట్టుమని పండ్రెండేండ్లు నిండకముందే పరమపదించింది." అని దుఃఖమును దిగమ్రింగుతూ జవాబు చెప్పింది. "ఊరడిల్లు శకుంతలా! ప్రతిజీవికీ కర్మకట్టికుడపందే విడవదు. బాధసహిస్తేనేగాని భక్తికుదరదు. అన్నట్టు అడగమరచాను, నీకు ప్రాయంపైబడ్డా పెళ్లిమాట తలపెట్టవేం శకుంతలా?" అంటూ మందహాసంచేసేడు.

ప్రభాకరరావు నోటనుండి ఈ మాటలు ఊడిపడేసరికి కొంచెంఉపశమిస్తున్న శకుంతల దుఃఖం మళ్లీ ఉబికిఉప్పొంగింది. ఆమెవిడచిన వేడినిట్టూర్పు వాతావరణాన్ని చీల్చి ప్రభాకరరావు హృదయంవరకు ప్రాకితాకింది. ఆమె హృదయంలో ఎన్నోభావాలు రేకెత్తేయి, మస్తిష్కంలో లెక్కలేనన్ని తలంపులు మెరిశాయి.

"అయితే ప్రభాకర్! అంధురాల్ని ఎవరుపెండ్లాడుతారు? నన్నుచూడ్డానికే సహించని స్వార్థపరులు పుస్తికట్టడానికి పూనుకొంటారా? అధవా, కడితే వాళ్లకినలుగుర్లో నగుబాటు, తాహాతుకు

తక్కువ కాదూ ? పోని ఇప్పుడు పెళ్ళికే ఎవరు పెనుగులాడేరు ?" అంటూ లేనిధైర్యము తెచ్చుకొని జవాబు చెప్పింది.

'అదికాదు శకుంతలా ! నిన్ను పెళ్ళాడ్డానికెవరైనా సమ్మతించి వచ్చారనుకో ' అంటూ గొంతు సవరించుకొని పలికేడు—

'అటువంటిది తటస్థించదు. ఒకవేళ సమకూడితే నే నిరాకరిస్తాను. ఎందుచేతనంటే ?........'

'ఎందుచేత ?'

'నేను వివాహితను కనుక' అని ధీమాగా సమాధానంచెప్పింది శకుంతల.

'శకుంతలా ! నీకు వివాహమైనదా? ఎప్పుడు? ఎక్కడ? ఎవరికి?' అతనికంఠము రుద్ధమైనది. హృదయకుహరములో తుపానుచెలరేగింది. అప్పుడే అప్రయత్నంగా వారిరువురిచేతులు కలుసుకొన్నాయి.

ప్రభాకరరావు పట్టభద్రుడు, సంఘసంస్కర్త. అతని నివాసస్థానం లక్ష్మీపురమే. అతనికి వేలువిడచిన మేనమామతప్ప 'నా' అన్నవారులేరు. పిత్రార్జితమైన భూవసతి, గృహముకలవు. ఉద్యోగమేదయినా కలిసి వచ్చేవరకూ అనవసరపు భేషజముల కాటపట్టైన పట్టణాలలో ఊరకే ప్రొద్దుపుచ్చడానికి ఇష్టపడక తన స్వగ్రామానికి చక్కావచ్చేడు. శకుంతలా ప్రభాకరుల ఇండ్లురెండూ ఎదురుగుమ్మాలు. ప్రభాకరునిదయకు పాత్రమైహృదయాన్ని అయస్కాంతంవలె ఆకర్షించింది శకుంతల. సంఘంసానుకూలం కాకపోయినా, అమ్మ

★ శ్రీమతి అడపా సుగుణమణి ★

లక్కలాడిపోసినా, తోడివారు తొంగిచూడకపోయినా కూడా, తనమేనమామ కుప్పలుతిప్పలుగా ఉత్తరాలు వ్రాసినా, వారిపవిత్రప్రేమని అరికట్టలేకపోయినాయి. కాలక్రమేణ శకుంతలా ప్రభాకరులు భార్యాభర్తలైనారు.

వేళాకోళానికిపాలైన క్రొత్తకోడలు అత్తవారింట అడుగుపెట్టగానే ప్రభాకరుడికి రెవిన్యూ యినస్పెక్టరు (Revenue Inspector) పదవి లభించింది. అంతవరకూ మీసముత్రిప్పుతున్న గ్రామమునసబు దాసోహం అన్నాడు. కండ్లెఱ్ఱజేసిన కరణం కాళ్ళావేళ్ళా తిరిగాడు. పరిహసించిన పౌరులు పడిగాపులు పడ్డారు.

ప్రభాకరరావు నివాసస్థానం పట్టణానికి మార్చుకొన్నాడు. కళ్యాణమై రెండేండ్లు గడచేయి. ఆదంపతుల ప్రేమాభివృద్ధి చిహ్నముగా ఒకకుమారుడు కలిగాడు. ఇంటవంటమనిషి సేవకులు, దాది ఉండడంచేత శకుంతలకు నేత్రలోపం కానరాకుండా కాలం గడచిపోతోంది.

ఒకరోజురాత్రి ప్రభాకరుడు కమానునుంచి తిరిగివచ్చేసరికి శకుంతల కంటతడిపెట్టడం కానిపించింది. కారణం ఏమని కలయవెదికి చూచాడు కాని కానరాలేదు.

'శకుంతలా ! నీవింకా దేనికొరకు విచారిస్తున్నావు? నీకు లోకములో నేను, చిన్నికుమారుడు క్షేమకు ఉన్నాం. మాకు నీకండ్లలోపం ఏమాత్రం కడగండ్లు పెట్టలేదు. నీవనవసరంగా మనస్సు నొప్పిచేసుకోవడం కూడదుసుమా' అంటూ ఓదార్చేడు ప్రభాకరుడు.

'ప్రపంచంనాకు ప్రబలాంధకారం. కట్టుకొన్నభర్తనీ, కడుపునగన్న కొడుకునీ చూడడానికి కళ్ళులేని నిర్భాగ్యురాలను. నాకు నాకొడుకుని చూడాలని మనస్సు కొట్టుకొంటున్నది. మీ దివ్యమంగళ

విగ్రహాన్ని సందర్శించాలని మనస్సు తహ తహ పడుతున్నది....ఓ భగవంతుడా! నేనేంపాపము చేసేనని నాకళ్లు పాడుచేసేవు......?" అని విలపిస్తూ ప్రభాకరునితొడపైకి ఒరిగిపోయింది.

'శకుంతలా! నా బాల్యస్నేహితుడైన డాక్టరొకడు పాశ్చాత్యదేశాలు తిరిగి కండ్లజబ్బులు బాగు చేయడంలో ప్రావీణ్యంపొందేడు. అతడు రేపోమాపో ఈవూరికి రానున్నాడు. వచ్చినవెంటనే అతనితో ఈ విషయం ప్రస్తావించి అతనిసలహా తీసుకుందాం. మనఅదృష్టం బాగుండి భగవంతునికరుణ మనవరకూ ప్రసరిస్తే నీదృష్టిమాంద్యం మాయవచ్చు.' అంటూ ఆ సమీపములోనే ప్రాకుచున్న రమేశాన్ని చేతులతో పైకెత్తి 'అమ్మనిన్ను కళ్లతోచూడాలని కంగారుపడుతోందిరా. ఆ భాగ్యానికి నోచుకుంటావో, లేదో బాబూ!' అంటూ ఆప్యాయంగా ముద్దుపెట్టుకొన్నాడు కొడుకుని.

ఆరోజున శకుంతల కండ్లకి శస్త్రచికిత్స చేయడానికి సర్వమూ సమకూర్చబడినవి. నిర్ణీతకాలానికి డాక్టరువచ్చాడు. బాగోఓగో, ఏదో ఆ గుండుకొమ్ము లనుమానం ఆరోజున తేలిపోవాలని నిశ్చయించుకొని ఆపరేషన్ టేబు (Operation Table) లెక్కింది శకుంతల. ఆమె యిష్టదైవాలని పూజించింది. యిలవేల్పు లకు మ్రొక్కింది. పెద్దలకి పేరంట్రాండ్రకి పసుపూ కుంకమూ చెల్లించింది. శస్త్రచికిత్స సమాప్తమైంది. 'ఆపరేషన్ (Operation) సవ్యంగా అయిపోయింది. ఆపైని భగవంతునిదయ, మీ అదృష్టం. నేటినుండి పదిహేనుదినములు కండ్లకుకట్టిన కట్టు విప్పకూడ'దంటూ డాక్టరు వెళ్లిపోయాడు.

రోగిని మంచంమీదనుండి లేవకుండా వలయుసౌకర్యాలు స్వయంగా ఏర్పాటుచేస్తూండేవాడు ప్రభాకరుడు.

'నా అదృష్టంబాగుండి మీ అర్ధాంగినైనాను. కాకుంటే నాపాట్లు కుక్కలకుకూడా లేకపోయి ఉండేవి. అయినా సేవకులుండగా మీరెందుకు శ్రమతీసుకుంటారండీ?" అంది శకుంతల సాభిప్రాయంగా.

'వెట్టిదానా ఆలిఅన అర్ధాంగి అని నీవెరుగుదువు. నా శరీరమునకై నే సేవచేసుకోకూడదూ. దానికొఱకూడా పరాయివాని సహాయంకావలెనా' అంటూ సమయోచితంగా జవాబుచెప్పేడు ప్రభాకరుడు.

'ఒకటీ......రెండూ......మూడూ......కాదు అబ్బా పదునైదుదినాలే ఎంతని ఓపిక పట్టనూ? రోజులుగడిచినట్లే కనబడవు. ఒక్కొక్కరోజు ఒకయుగంలాగ తోస్తోంది. ఈయిల్లు ఎల్లాంటిదో? ఈగది ఎట్లాగుంటుందో? రమేశు ఎవరిపోలికో...... ?"

* * * *

'అదిగో నాకుమారుని కిలకిలనవ్వు...రమేశ్...రమేశ్...రమేశ్' అని కండ్లకట్టువిప్పి పిచ్చిదాని వలె లేచిపరుగెత్తి చిన్నకుమారుని ముద్దులాడి మూర్ఛపోయింది శకుంతల.

'శకుంతలా, శకుంతలా! ఒక్కరోజు తాళలేకపోయితివా? అయ్యో! కలకాలం గుడ్డిదాని వలె పడియుండుమని నీ నుదుట భగవంతుడు వ్రాసిఉండెనా?" అంటూ శకుంతలనుచేరి శైత్యోపచారాలు చేయ మొదలుపెట్టాడు ప్రభాకరుడు.

'భయంలేదు. శస్త్రచికిత్సకి పదిరోజుల విరామమేచాలు. చావుకువేస్తే లంకణానికి తేలుతుందని నేను పదిహేనురోజులని నియమంపెట్టాను. కొత్తగా వెలుతుర్ని చూడడంచేత మూర్ఛపోయింది. అదిగో స్పృహకలుగుతుంది. మీయొద్ద భగవంతుడున్నాడు. మీ రన్యోన్యానురాగముతో లోకానికి ఆదర్శ దంపతులుగ జీవించం' డని డాక్టరు సరిగా ఆసమయమునకేవచ్చి ఆశీర్వదించాడు.

శకుంతలకి చైతన్యం కలిగినతరువాత డాక్టరుకి ప్రణామంచేసి, కొడుకునెత్తుకొని ముద్దులాడి, భర్తను సందర్శించి మందహాసంచేసింది.